న్యూ ఇయర్ జోష్

యువతకు ఆఫర్ల వల
కొత్త ఆశలతో క్రైస్తవ యువతుల ప్రార్థనలు
ఊపందుకున్న బైక్‌ల శబ్దాలు







కడప కల్చరల్ డిసెంబరు 31, (ఆంధ్రజ్యోతి): పాత సంవత్సరానికి వీడ్కోలు 2025 కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ జిల్లా, నగర ప్రజలు ఉల్లాసంగా, హుందుషారుగా బైక్‌లలో చక్కర్లు కొట్టారు. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ యువత, పిల్లలు, యువతులు, మహిళలు, వృద్ధులు సైతం హుషారుగా తిరిగారు. అర్ధరాత్రి 12 గంటలు గడిచి వెంటనే హ్యాపీ న్యూయర్ అంటూ స్నేహితులు, బంధువులకు, ఆప్తులకు సెల్‌ఫోన్, నేరుగా కలిసి పలుకరింపులు సాగించారు. నూతన సంవత్సరం రోజున గడిపే మధుర జ్ఞాపకాలను ఆ యేడాదంతా మరువలేని ఆనందాలను పంచుకునేలా కార్యచరణ రూపొందించుకున్నారు. అర్ధరాత్రి సమయంలో క్రైస్తవులు సువార్త కూటములు, సభలు, సమావేశాలు, ప్రార్థనలు నిర్వహించుకున్నారు. క్రైస్తవ యువతులు అందమైన దుస్తులతో ముస్తాబై ఆనందంలో మునిగి తేలారు. బంధువులు, మిత్రులు, సహచరుల సందడితో కడప నగరంలోని చర్చిలు సందడిగా మారాయి.

నగరంలో ఆఫర్ల హడావుడి

ఒకటి కొంటే మరొకటి ఫ్రీ అనే ఆఫర్ల హడావుడి నగరంలో నెలకొంది. అందుకు అనుగుణంగా యువతను ఆకట్టుకునేలా నగరంలోని వివిధ కూడళ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఆ కోవలో పలు హోటళ్ల నిర్వాహకులు వినియోగదారుల కోసం వివిధ రకాల ఆహార పదార్థాలను రెడీ చేసి ఆఫర్ల వల విసిరారు. కొత్త సంవత్సరం ప్రత్యేక కానుకగా తక్కువ ధరలోనే ఆహార పదార్థాలంటూ రేట్ల వివరాలు పొందుపరిచారు. రాయసీమ మాంసం ప్రియులు కొత్త సంవత్సరం రోజు ముక్కలేకుండా అసలు వుండలేరు. కనుకనే హోటళ్ల నిర్వాహకులు ఒక బిర్యానీ కొంటే మరొకటి ఫ్రీ అంటూ కూల్ డ్రింక్స్, కేజీ మిఠాయి, కిలో మిక్చర్ అంటూ ఆఫర్ల మీద ఆఫర్లను ప్రకటించారు.

జోరుగా కేక్‌ల అమ్మకాలు

న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో కేక్‌లకు ప్రత్యేకత కలదు. ప్రతి ఒక్కరూ ఇతరులకు హ్యాపీ న్యూయర్ చెప్పడం పరిపాటి. ఆ క్రమంలో కొందరు స్నేహితులకు చాక్‌లేట్స్ ఇస్తూ మరికొందరు నోటిని తీపిచేసేలా స్వీట్స్ కేక్‌లు అందజేసి చెబుతారు. ఇంటిల్లిపాది సంతోషంగా కేక్ కట్‌చేసి ఒకరినొకరు తినిపించుకోవడం పరిపాటి. నగరంలో బేకరీలు, స్వీట్స్ దుకాణాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి.

కిక్కిరిసిన వైవీస్ట్రీట్

కొత్త సంవత్సరం రోజున కొత్త బట్టలు ధరించి, మిత్రులు, ఉన్నతోద్యోగులకు ఇచ్చేందుకు బొకేలు సిద్ధం చేసుకున్నారు. వాటికోసం ప్రత్యేక దుకాణలు వెలిశాయి. ఇంట్లో మంచి పిండి వంటలు తినాలని ప్రతి ఒక్కరికీ వుంటుంది. ఆ కోరికను తీర్చుకోవడం కోసం అందుకు అనువైన దుస్తులు ఇంటిల్లిపాదికి తీసుకునేందుకు వైవీస్ట్రీట్, టీకేఎం స్ట్రీట్, ఇతర దుకాణాలకు రావడం పరిపాటి. ఆ క్రమంలో ఆయా దుకాణాలు ప్రజలతో కిక్కిరిశాయి.



రైతు ఆలోచన విధానంలో మార్పు రావాలి

కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

కడప కలెక్టరేట్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి) వ్యవసాయంలో నవ శకానికి నాంది పలకాలని రైతు ఆలోచనా విధానంలో మార్పు రావాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పిలుపు నిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన 2025-26 ఆర్థిక సంవత్సరం ఫైనాన్స్ స్కేల్ ఫిక్సేషన్ ప్రతిపాదనలపై డిస్ట్రిక్ లెవల్ టెక్నికల్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీలో సమీక్షించిన అంశాలను, ప్రతిపాదనలను స్టేట్ లెవల్ కమిటీకి నివేదిస్తామన్నారు. వ్యవసాయాన్ని కూడా ఒక ఇండస్ట్రీగా గుర్తించి రైతులకు సృజనాత్మకతకు వారు వాడే పనిముట్లు, మోటార్లు తదితర వాటి నిర్వహణ ఖర్చులతో కలిపి రుణాలు అందించేలా రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకు వస్తామన్నారు. ముఖ్యంగా వ్యవసాయంలో సుస్థిర అభివృద్ధిని సాధించేందుకు రైతులు శాస్త్రీయ మెళకువలను పాటించాలన్నారు. పంటల మార్పిడి విధానాన్ని అవలంభించాలని ఉద్యాన పంటల సాగును అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం డీసీసీబీ ప్రచురించిన 2025 సంవత్సర క్యాలెండర్లు, డైరీలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఎల్డీఎం జనార్ధనం, ఏజీఎం విజయ విహా కేడీసీసీ సీఈఓ రాజమ్మ, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ శారదమ్మ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు - ఇద్దరు మృతి

ఐదుగురికి గాయాలు



ఘటనాస్థలిలో డ్రైవర్ మృతదేహం



ఆస్పత్రిలో అబ్దుల్ మృతదేహం

జమ్మలమడుగు 31(ఆంధ్రజ్యోతి): చిటిమిటి చింతల శివార్లలో మంగళవారం రాత్రి కారు డివైడర్‌ను ఢీకొనడంతో కారు డ్రైవర్ నందీశ్(21), అబ్దుల్(20) దుర్మరణం చెందగా మరో ఐదుగురు గాయాలపాలయ్యారు. పోలీసులు అందించిన వివరాల మేరకు... కొత్త సంవత్సరం వేడుకలు చేసుకునేందుకు స్నేహితులు జగన్, షాహిన్, ప్రేమ్, చైతన్య, షాజహాన్, అబ్దుల్, కారు డ్రైవర్ నందీశ్ కారులో మంగళవారం సాయంత్రమే గండికోటకు బయలు దేరారు. ముద్దనూరు మీదుగా గండికోటకు బయలు దేరిన కారు చిటిమిటి చింతల వద్ద డివైడర్‌ను ఢీకొంది. ఘటనాస్థలంలో కారు డ్రైవర్ నందీశ్ మృతి చెందగా జగన్, షాహిన్, ప్రేమ్, చైతన్య, షాజహాన్, అబ్దుల్, గాయపడ్డారు. క్షతగాత్రులు జగన్, షాహిన్(పులివెందుల)ను చికిత్స నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నందీశ్ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన లింగాల మండలం పెద్దకుడాల వాసి అబ్దుల్ ఆస్పత్రిలో మృతి చెందాడు. ప్రేమ్, చైతన్య, షాజహాన్(సింహాద్రిపురం)ను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ఎస్టీ ఎస్టీ కాలనీల్లో సూర్యఘర్ రిజిస్ట్రేషన్

కడప నాగరాజుపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కాలనీలో ప్రతి ఇంటి వద్ద ఏపీఎస్పీడీసీఎల్ సిబ్బంది పీఎం సూర్య ఘర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయడం ప్రారంభించారు. పథకం ఇపుడు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నివసించే ప్రతి వినియోగదారులకు అందించాలని ముఖ్యమంత్రి ఏపీలో ప్రారంభించాలని నిర్ణయించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రజలకు చేరుటకు తమ ఇంట్లోనే ఉత్పత్తి చేసేలా ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్ అమర్చుకోవడానికి అమలు చేస్తామన్నారు.

మన్ననలు, అభినందనలే అవార్డులు

ఆర్జేడీ ఉద్యోగ విరమణ వేడుకలో వక్తలు



డేవిడ్ కుమార్‌స్వామిని సత్కరిస్తున్న దృశ్యం

కడప మారుతీనగర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగికి మన్ననలు, అభినందనలే అవార్డుల వంటివని వక్తలు అన్నారు. స్థానిక కోటిరెడ్డి మహిళా కళాశాల సభా భవనంలో రాయలసీమ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్, హయ్యర్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ డేవిడ్ కుమార్‌స్వామి ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాష, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ డేవిడ్ కుమార్‌స్వామి పలువురి మన్ననలు అందుకునేలా విధులు నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. రాయలసీమ జిల్లాల డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లెక్చరర్లు కె.వి. రమణ, సచిదేవి, జి.పి. ఆశలత, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం

చెన్నూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం, ఆశించదగ్గ ఆదాయం లభిస్తాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం బయనపల్లెలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి క్షేత్రస్థాయిలో శిక్షణ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, పైర్ల సాగు, వినియోగించే కషాయాలు, జీవామృతం తయారీ, అంశాలపై శిక్షణ ఇచ్చారు. భూమి ఆరోగ్యంగా ఉంటే వాతావరణం బాగుంటుందన్నారు. మండల వ్యవసాయాధికారి శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి రైతు సాధ్యమైనంత వరకు ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవాలన్నారు. అనంతరం బయనపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులతో ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ నిర్వహించారు.

రేకులషెడ్డు కూల్చివేత



రేకుల షెడ్డును కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సికెదిన్నె, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బుగ్గలేటిపల్లెలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డును మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చేశారు. బుగ్గలేటిపల్లె సర్వేనంబరు 11/5లో 51 సెంట్లు బావి స్థలం ఉందని, దాన్ని తొలగించాలని గ్రామస్థులు తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రేకులషెడ్డు తొలగించాలని వారికి రెవెన్యూ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. కాగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కడప పర్యటనలో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ సిబ్బంది మంగళవారం రేకుల షెడ్డును తొలగించారు. అయితే బాధితులు ఆ స్థలం తమదని అడ్డుకోగా పోలీసుల సమక్షంలో అధికారులు రేకుల షెడ్డును పూర్తిగా కూల్చివేశారు. తహసీల్దారును వివరణ కోరగా గ్రామ అవసరాలకు సంబంధిత బావి స్థలమని, ఇక్కడ ఎవరికీ పట్టాలు ఇవ్వలేదన్నారు.

సాయిబాబా పాఠశాలలో ముందస్తు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సాయి సుధీర్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సాయిబాబా పాఠశాలలో మంగళవారం ఘనంగా ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పాఠశాల వైస్ చైర్మన్ ఎంవీ సాయిసుధీర్ కుమార్ రెడ్డి విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైవీయూలో ముందే వచ్చిన సంక్రాంతి





భోగి మంటలు అంటిస్తున్న వీసీ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథ్‌రెడ్డి - గొబ్బిళ్లు ఆడుతున్న విద్యార్థినులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం సంక్రాంతి సంబరాలను ముందే మోసుకొచ్చింది. వైవీయూ గురుకుల ప్రాంగణం ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలతో అలరారగా, యువకులు ఉట్టికొట్టడంలో ఉత్సాహంగా పోటీ పడ్డారు. సంప్రదాయ కోలాటాలు, హరిదాసు సంకీర్తనలతో విశ్వవిద్యాలయంలో సంక్రాంతి సంబరాలు కన్నులపండువగా సాగాయి. వాణిజ్య శాస్త్ర అచార్యులు విజయభారతి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథిగా ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి ప్రారంభించారు. పిల్లలను ఆశీర్వదించడం, భోగిమంటలు, సంక్రాంతి లక్ష్మీకి పూజలు చేసి పండుగను ఆహ్వానించారు. ఉపకులపతి మాట్లాడుతూ తెలుగు ప్రజలకు సంక్రాంతి ప్రీతికరమైన పండుగ అన్నారు. సంక్రాంతి రైతుల పండుగ, సంక్రాంతి నాటికి రైతులు పండించే నవధాన్యాలు ఇంటికి చేరతాయి. అందుకు కృతజ్ఞతగా రైతులు సంక్రాంతి, కనుమ పండుగలు చేసుకుంటారన్నారు. అధికారులు, విద్యార్థులు, అధ్యాపకులు ఉట్టికొట్టడంతో పోటీపడ్డారు. విద్యార్థులు ఉత్సాహంగా గాలిపటాలను వదిలారు. విద్యార్థినులు ముగ్గులు వేయడంలో పోటీపడ్డారు. విద్యార్థులు గ్రామీణ సాంప్రదాయాలను నాటి ఆచార వ్యవహారాలను పరిచయం చేస్తూ వేడుకలు కొనసాగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

జమ్మలమడుగు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసిన సచివాలయ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు పడింది. మంగళవారం జమ్మలమడుగు 19వ వార్డులో పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఈ నేపథ్యంలో వెరిఫికేషన్‌లో పెన్షన్ తీసేస్తానంటూ లబ్ధిదారులను భయపెడుతూ ఒక్కొక్క లబ్ధిదారుడి వద్ద రూ.300 నుంచి రూ.500 వసూలు చేస్తున్నారంటూ జమ్మమడుగు నగర పంచాయతీ వార్డు మహిళా సంరక్షణ సచివాలయ ఉద్యోగి ఎం.భారతిబాయిపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీనిపై కలెక్టర్ శ్రీధర్ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగిని సస్పెండ్ చేశామని జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా యంత్రాంగం ఆదేశించిందన్నారు.

ఆంగ్ల సంవత్సరాది సంబరం



జిల్లా అంతటా ఆంగ్ల సంవత్సరాది సంబరం వెల్లివిరుస్తోంది. ఎటు చూసినా 'హ్యాపీ న్యూఇయర్' అనే మాటలే వినిపిస్తున్నాయి. కేకులకు, పూలబొకేలకు డిమాండ్ పెరిగింది. కేకుల దుకాణాలు సైతం మంగళవారం రాత్రి కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. జిల్లా ప్రజలంతా అర్ధరాత్రి వరకు మేలుకుని 2025కు ఘనస్వాగతం పలికారు.



ఎంపీడీవోపై దాడి హేయమైన చర్య

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి హేయమైన చర్య అని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. వైసీపీ నేతల దాడిలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎంపీడీవోను మంగళవారం మంత్రి పరామర్శించారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ వైద్యులకు సూచించారు. ఎంపీడీవోకు మనోధైర్యం కల్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై చంద్రబాబు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరిగినా సహించేది లేదని హెచ్చ రించారు. ఈయన వెంట రిమ్స్ సూపరిం టెండెంట్, జడ్పీ సీఈవో ఓబులమ్మ ఉన్నారు. అనంతరం కడప నగరంలోని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఇంటికి వెళ్లారు. ఇటీవల ఆయన కుమారుడు గుండెపోటుతో మృతి చెందడంతో ఎమ్మెల్సీని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణ కమిషన్ 3న జిల్లాకు రాక

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల్లో ఉప వర్గీకరణపై విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ 3వ తేదీన జిల్లాకు వస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కె.సరస్వతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం అభిప్రాయ సేకరణకు ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు కమిషన్ ఉదయం 3వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో వివిధ ఉపకులాల సభ్యులు, సంఘాల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. తర్వాత వాటిని పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తారని వివరించారు. కమిషన్‌కు వినతులు అందించేవారు వైఎస్సార్ కడప జిల్లాకు సంబంధించిన వారై ఉండాలని తెలిపారు. తమ వినతిపత్రాలకు సంబంధించి తగిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని తెలిపారు.

కేంద్రమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

● కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడపకలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1వ తేదీ నుంచి మూడురోజుల పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర శాఖ మంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు కేంద్రమంత్రి వస్తున్నారన్నారు. ఆయన 1వతేది రాత్రికి జిల్లాకు చేరుకుంటారని, 2వ తేదీ ఉదయం సీకేదిన్నె, జమ్మలమడుగు మండలాల్లో క్షేత్రస్థాయిలో జరిగిన, జరుగుతున్న ప్రగతిని పరిశీలిస్తారని తెలిపారు. 3 వతేదీ ఉదయం పర్యటన ముగించుకుని తిరిగి వెళతారన్నారు. కేంద్రమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లాలో ఆయా రంగాలలో సాధించిన ప్రగతి నివేదికలను సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, కమిషనర్ మనోజ్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు ఆనంద్‌నాయక్, డాక్టర్ నాగరాజు, నాగేశ్వరరావు, మీనాక్షి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో జిల్లాకు 6వ స్థానం

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 31: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో జిల్లాకు 6వస్థానం లభించింది. మొత్తం 2,58,315 మందికి గాను రూ.110.66 కోట్లు మంజూరు అయ్యాయి. అందులో 2,48,543 మందికి పంపిణీ చేశారు. 96.22శాతం ప్రగతి సాధించారు. జిలాలో మరో 9,752 మంది పింఛన్లు తీసుకోవాల్సి ఉంది. ఇందులో కడప పట్టణంలోనే 1,000 మంది మొదటి రోజు పింఛన్ పొందలేకపోయారు. ఇదిలా ఉండగా జిల్లాలో ప్రొద్దుటూరు పట్టణం ప్రథమస్థానంలో నిలిచింది. ఇక్కడ 14,870 పింఛన్లు మంజూరుకాగా 14,501 పింఛన్లు పంపిణీ చేసి 97.52శాతం ప్రగతి సాధించింది. కాశినాయన మండలం చివరిస్థానంలో నిలిచింది. ఇక్కడ 4,815 పింఛన్లు మంజూరు కాగా 4,525 పింఛన్లు పంపిణీ చేసి చివరిస్థానంలో నిలిచింది. ఇదిలా ఉండగా డీఆర్‌డీఏలో ఏపీడీ ప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది పింఛన్ల పంపిణీపై కంట్రోలల్ రూమ్ నుంచి మానిటరింగ్ చేశారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

కడప కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కోటి ఆశలతో 2025 కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్న జిల్లా ప్రజలకు కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికి సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు, సౌభాగ్యాలు అందాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలకు సంతృప్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరి భాగస్వామ్యంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో ఆకాంక్షించారు.



విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు

కడప కల్చరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఇతర జిల్లాల నుంచి కూడా మహిళా భక్తులు హాజరై రాహుకాల పూజలు నిర్వహించా రు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో పూజలు చేయడం వల్ల ఆ తల్లి అనుగ్రహం తప్పక లభిస్తుందని విశ్వాసం.

అమ్మవారి ఆశీస్సులు అందుకోండి

నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం అమ్మవారిని దర్శించుకుని ఆ తల్లి చల్లని దీవెనలు అందుకోవాలని ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ ఈ సందర్భంగా ప్రజలను కోరారు.



రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ అమ్మవారు

విద్యుత్ బిల్లుల చెల్లింపు మరింత సులభతరం

కడప నాగరాజుపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల చెల్లింపు వినియోగదారులకు మరింత సులభతరం కానుందని ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు ఎస్.హరిసేవ్యానాయక్ తెలిపారు. కడప ఆపరేషన్ డివిజన్‌లో ప్రయోగాత్మకంగా డైనమిక్ క్యూఆర్‌కోడ్ విద్యుత్ బిల్లులో ముద్రించి బిల్లులు పంచనున్నట్లు తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి ప్రస్తుత నెల బిల్లులు చెల్లించే విధంగా ప్రతి బిల్లులో ముద్రించి ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంట్లోనే ఉండి తమ ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ అప్లికేషన్ల ద్వారా బిల్లులు చెల్లించేలా విద్యుత్ శాఖ ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.





సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

పెండ్లిమర్రి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అన్వేష్ కోరారు. మంగళవారం పెండ్లిమర్రిలో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. అన్వేష్ మాట్లాడుతూ జనవరి 4,5 తేదీల్లో మహాసభలు ఉంటాయన్నారు. జియోన్ కళాశాల నుంచి ర్యాలీ అనంతరం ఐటీఐ సర్కిల్ వద్ద బహిరంగ సభ ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా కర్నూలు మాజీ ఎమ్మెల్యే, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. సీపీఎం నాయకులు చెన్నప్ప, మల్లేష్, వెంకటరమణ, బాలగంగయ్య, పగడాలయ్య, ఉత్తయ్య, ఈశ్వరయ్య, లక్ష్మీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

కడప మారుతీనగర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆశాలకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి, జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీల జీవోలను తక్షణమే విడుదల చేయాలన్నారు. మంగళవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే ఆశాలకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగానికి భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని కూడా పెడచెవినపెట్టడం బాధాకరమన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ రూపొందించామని, జనవరి 7 నుంచి ఆందోళనలు చేపడతామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశాలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలన్నారు. అంతవరకు రూ.26వేల వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రిటైర్డ్‌మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచి సాధారణ, మెటర్నిటీ సెలవులు ఇవ్వాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకురాలు శాంతమ్మ, అనసూయ, శోభారాణి, పార్వతి పాల్గొన్నారు.

నూతన సంవత్సరాన్ని మొక్కలతో స్వాగతిద్దాం



గ్రీట్ విత్ గ్రీన్ అనే పోస్టరును ఆవిష్కరిస్తున్న దృశ్యం

పులివెందుల టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరాన్ని మొక్కలతో స్వాగతిద్దామని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. పులివెందుల నియోజకవర్గ ప్రజలకు ముందస్తు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రాణం లేని బొకే కన్నా ప్రాణం ఉన్న మొక్కే మంచిదన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో రూపొందించిన పచ్చదనంతో పలకరింపు అనే పోస్టరును ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు ఎస్ఎండీ యూనస్, మహ్మద్‌ఇక్బాల్ పాల్గొన్నారు.

97 శాతం పింఛన్లు పంపిణీ

చెన్నూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా మంగళవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం 97 శాతం పూర్తయిందని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు తెలిపారు. తెల్లవారుజామున 4గంటలకే పంచాయతీ సిబ్బంది పింఛనుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారన్నారు. పింఛన్ ముందే అందజేయడంతో పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేశారు.





దానకర్ణుడు బుడ్డా వెంగల్‌రెడ్డి



వెంగల్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రవిశంకర్‌రెడ్డి

కడప నాగరాజుపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దానకర్ణుడు ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బుడ్డా వెంగల్‌రెడ్డి అని ఆర్పీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి కొనియాడారు. రేనాటి సూర్యచంద్రుల విగ్రహం ఏర్పాటు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కడప ప్రెస్‌క్లబ్‌లో బుడ్డా వెంగల్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విక్టోరియా మహారాణి సైతం ఆయన దాతృత్వానికి అబ్బురపడి నాటి మద్రాసు గవర్నర్ ద్వారా బంగారు పతకాన్ని బహూకరించి ఘనంగా సత్కరించిందని గుర్తు చేశారు. కడప నగరలో వెంగల్‌రెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డిల విగ్రహాల ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ మున్సిపల్ జనరల్ బాడీ సమావేశంలో తీర్మానించడం అభినందనీయమన్నారు.

పదోన్నతి జాబితాలో 41 మంది సీఐలు

కడప క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సీఐలుగా పనిచేస్తున్న 155 మందికి డీఎస్పీలుగా పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం జాబితా ప్యానెల్‌ను సిద్ధం చేసింది. కర్నూలు రేంజ్ పరిధిలో 41 మంది డీఎస్పీలుగా పదోన్నతుల జాబితాలో ఉన్నారు. త్వరలో అధికారికంగా పదోన్నతి జాబితా విడుదల కానుంది.

జిల్లా సహకార శాఖ అధికారిగా సురేశ్

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార శాఖ అధికారిగా ప్రొద్దుటూరు డిప్యూటీ రిజిస్ట్రార్ సురేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి జిల్లా సహకారశాఖ అధికారిగా ఉన్న కడప డిప్యూటీ రిజిస్ట్రార్ సుభాషిణి మంగళవారం పదవీ విరమణ చేశారు. దీనితో ప్రొద్దుటూరు డిప్యూటీ రిజిస్ట్రార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.









భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి



పాయసంపల్లెలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

వీరపునాయునిపల్లె, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్యామ్ బాబు రైతులకు సూచించారు. భూసార పరీక్షల ఫలితాలను బట్టి ఎరువులను వాడవచ్చని, ఇలా చేయడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మంగళవారం పాయసంపల్లె, కీర్తిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ శనగ పంటలో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. శనగ పంట పూత, పిందె దశలో ఉందని, ఈ దశలో 13.0.45 వంటి ఎరువులను పురుగుమందులతో పాటు కలిపి పిచికారీ చేసుకుంటే నాణ్యమైన దిగుబడి సాధించవచ్చన్నారు. అలాగే సాగుచేసిన పంటకు ఇ-పంట నమోదు చేసుకోవాలన్నారు.





జాతీయస్థాయి స్కూల్ ర్యాంకింగ్ చెస్‌కు శ్రీచైతన్య విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

వేంపల్లె, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 13వ జాతీయ స్థాయి స్కూల్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌కు శ్రీచైతన్య హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆ విద్యార్థులకు నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నవంబరు, డిసెంబరు నెలల్లో నిర్వహించిన ఏపీ స్టేట్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో తమ పాఠశాల విద్యార్థులు అండర్-14 విభాగంలో తనుశ్రీ, అండర్-16లో తలారి కౌశిక్ అద్భుత ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. విద్యార్థుల విజయయాలకు తల్లిదండ్రుల మద్దతు కీలకమన్నారు. జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించాలని కోరారు.

గండిలో ఏర్పాట్లు పూర్తి

చక్రాయపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో 2025 నూతన సంవత్సరం వేడుక సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, మాజీ చైర్మన్ వెంకటస్వామి, ఏఈ నిఖిల్ అన్ని పనులు చేయించారు. భక్తు లు భారీగా వస్తారని, క్యూలైన్లు, సర్వదర్శనం, రూ.100 దర్శనం, స్పెషల్ దర్శనం, తలనీలాలు, అన్నదానం, లడ్డుకౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తాదులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా నూతన సంవత్సరానికి గుర్రకొండ, మదనపల్లె, చిత్తూరు ప్రాంతాల నుంచి ఆంజనేయస్వామి మాల వేసి మంగళవారం రాత్రికి భారీఎత్తున భక్తులు పాల్గొన్నారు. 41రోజులు దీక్ష చేసి ఆంజనేయస్వామి వద్దకు వచ్చి మాలలు తీసివేయడం ఆనవాయితీ. డెకరేషన్ కోసం మదనపల్లె నుంచి పూలు తెప్పించి ప్రధాన అర్చకులు కేసరి, రాజారమేష్ ఆంజన్నకు తోమాలలతో అలంకరించేందుకు భారీఎత్తున పూలు తెప్పించారు. గర్భాలయ పూలమాలలతో అలంకరించనున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.


విశ్వప్రగతి చిట్స్ కార్యాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన పార్టీ నాయకుడు తుంగా రమణయ్య తదితరులు

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మైదుకూరు నియోజకవర్గం నంఉ జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించి, మరింత అభివృద్ధి చేయుటకు నిధులు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీగా దేహదారుఢ్య పరీక్షలు

- పర్యవేక్షించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


కానిస్టేబుల్ అభ్యర్థి లాంగ్‌జంప్

కడప క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు కడప నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో దేహదారుఢ్య పరీక్షలను రెండో రోజు మంగళవారం ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షను పూర్తిచేసిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంటు, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులకు ఉమ్మడి కడపజిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. ప్రతిరోజూ 600 మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొంటారని, ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతిరోజూ అభ్యర్థులకు మొదటగా సర్టిఫికెట్స్ పరిశీలన, ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్‌మెంట్స్ చేస్తారన్నారు. తరువాత బయోమెట్రిక్ తీసుకుంటారని తెలిపారు. దేహదారుఢ్య పరీక్షల్లో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా ఈవెంట్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు ఉన్నారు.

భవిత కేంద్రం విద్యార్థులకు వీల్‌చైర్లు పంపిణీ

వేంపల్లె, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె భవిత కేంద్రంలోని దివ్యాంగ చిన్నారులకు మంగళవారం వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ఎంఈఓ జాఫర్‌సాదిక్, షేక్ నజీమ్ అహ్మద్ కడపరూరల్ డెవలప్‌మెంట్ ఫర్ యూత్ వెల్ఫేర్ సమితి, ఎన్జీఓ, డాక్టర్ బాషల చేతులమీదుగా వీటిని పంపిణీ చేశారు. ఎంఈఓ జాఫర్‌సాదిక్ మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారులకు అవసరమైన ఉపకరణాలన్నీ ఎప్పటికప్పుడు దాతల సహకారంతో భవిత కేంద్రం సిబ్బంది సమకూరుస్తున్నారన్నారు. విద్యార్థులకు అలవెన్స్ అందజేశామన్నారు. ఎన్జీవో నజీమ్ అహ్మద్ మాట్లాడుతూ చిన్నారులకు సాయం అందించేదుకు ముందుంటానన్నారు.

అభ్యంతరాల గడువు పొడిగింపు

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల సామాజిక తనిఖీ అభ్యంతరాల గడువును పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలు కె.సరస్వతి పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామ, వార్డు సచివాలయ కార్యాలయాల్లో ఎస్సీ కులగణ గణాంకాలు ప్రదర్శించినట్లు వివరించారు. ఈనెల 7వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు. అనంతరం ఈనెల 17వ తేదీన సంబంధిత సచివాలయాల్లో తుది జాబితాను ప్రదర్శించనున్నట్లు వివరించారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను వీఆర్వోలు పరిశీలించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు పంపుతారు. తదుపరి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పునఃపరిశీలించి తహసీల్దార్‌కు నివేదిస్తారు. ఆ తర్వాత తహసీల్దార్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వోలు కలిసి వివరాలను పరిశీలించి తుది ఆమోదం తెలిపి ఆ వివరాలను భద్రపరుస్తారు.ఈ వివరాలు ఖచ్చితత్వాన్ని పెంపొందించుటకు సంబంధిత అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ 50 వివరాలను ర్యాండంగా తనిఖీ చేస్తారు. ఈ సోషల్ ఆడిట్‌ను సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు పర్యవేక్షిస్తారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వీసీని కలిసిన పాలక మండలి సభ్యులు



కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయ పాటక మండలి సభ్యులు విద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డిని కలిశారు. ఉపకులపతిగా నియమతులయ్యాక తొలిసారిగా వారు భేటి అయ్యారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధిపై చర్చించారు. వైవియును పూర్వ అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకుమీ సహకారం కావాలని వీసీ ఆచార్య కృష్ణారెడ్డి కోరారు. అనంతరం వీసీని సత్కరించారు. పాలక మండలి సభ్యులుఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ప్రొఫెసర్ పి.చంద్రమతి శంకర్, జె.వెంకటలక్ష్మి, కె.చిన్న సుబ్బారావు, ప్రొఫెసర్ ఎం.మల్లికార్జునరెడ్డి, పి.ముబీన బేగం, విద్యాసాధన విద్యాసంస్థల అధిపతి అక్బర్ ఖాన్ పాల్గొన్నారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
APEWIDC, KADAPA DIVISION

Tenders are invited on e-procurement Short Tender Notice **NIT No. 23 to 26/EE/APEWIDC/DM/Kdp/2024-25, Dt. 31.12.2024.** Downloading commencement on 02.01.2025 and closing date may be viewed in e-procurement.gov.in

For further details can be viewed at https: **//tender.apeprocurement.gov.in** or contact **Cell : 93906 63855**

Sd/- D. Gurivi Reddy,
Executive Engineer,
APEWIDC, Kadapa.

ANDHRA PRADESH MEDICAL SERVICES & INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION, KADAPA.

Tender Notice No.
04/EE/APMSIDC/Div/Kdp/2024-25, dt:31.12.2024

Tender is invited through 'e' procurement platform for the work

1) Construction of Sub Centre building (balance work) at Ananthasamudram(v) Pullampeta(M) in Annamayya District.

Tender Schedule to the uploaded in www.apeprocurement.gov.in on 02.01.2025 for any other information and clarification, please contact the Executive Engineer, APMSIDC Division Office, New RIMS Campus, Kadapa in office working hours. **Ph. No. 08562-225632 (8525839240)**

EE / APMSIDC / DIV / KDP.





5న పులివెందులలో మెగా జాబ్‌మేళా

● పార్టీలకు అతీతంగా యువత సద్వినియోగం చేసుకోవాలి ● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జనవరి 5న పులివెందులలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పులివెందులలో రామగోపాల్‌రెడ్డి ఇంటి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వివిధ దేశాల్లో పర్యటిస్తూ అగ్రగామిగా ఉన్న పారిశ్రామిక కంపెనీలతో మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు సీడాప్ స్కిల్ ఏపీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారన్నారు. అందులో భాగంగానే జనవరి 5న ఆదివారం పులివెందులలో ఈ మెగా జాబ్‌మేళా జరగనుందన్నారు. పులివెందుల నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అహోబిలాపురం నూతన పాఠశాలలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 26 కంపెనీలలో దాదాపు రెండువేల ఉద్యోగాలు భర్తీ చేయడమే జాబ్ మేళా లక్ష్యమన్నారు. టెక్ మహీంద్ర, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్ఐసీ, ఆదిత్య బిర్లా, కియా, పేటీఎం, టీవీఎస్, శ్రీరామ్ ఫైనాన్స్ తదితర కంపెనీలు రానున్నాయన్నారు. ఈ జాబ్ మేళాను పార్టీలకతీతంగా యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9గంటల నుంచి ఈ జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. ఈ జాబ్‌మేళాలో 5వ తరగతి చదువుకున్న వారి నుంచి ఎంటెక్ చదువుకున్న వారి వరకు ఈ జాబ్‌మేళాలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం సీడాప్ జిల్లా కోఆర్డినేటర్ ప్రసాద్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు ఇది మంచి అవకాశమన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ మెగా జాబ్‌మేళా చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా 2025 నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 5న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు.

ఈ జాబ్‌మేళాలో ప్లేస్‌మెంట్ రాని నిరుద్యోగ యువతీ యువకులను వదిలేయకుండా వారికి శిక్షణ ఇచ్చి మళ్లీ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రతినెలా ఒక నియోజకవర్గంలో జాబ్‌మేళా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

6న కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష: ఏఐటీయూసీ

కడప సెవెన్ రోడ్స్ డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జనవరి 6న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరాహార దీక్షను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఏపీ భవన నిర్మాణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లింగన్న కోరారు. మంగళవారం రవీంద్ర నగర్‌లో భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు.

ఫిబ్రవరి వరకు అక్రిడిటేషన్ల గడువు పెంపు

కడప కలెక్టరేట్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు డిసెంబరుతో ముగుస్తున్న నేపథ్యంలో కాల పరిమితిని ఫిబ్రవరి 28వ తేదీ వరకు పెంచారు. ఈ మేరకు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని డీపీఆర్వో వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

నిబంధనలు పాటించని కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి

కడప నాగరాజుపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని బీఈడీ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్‌సీటీఈ నిర్దేశించినట్లు కాకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలల గుర్తింపును రద్దుచేయాలని కోరారు. జిల్లాలోని బీఈడీ కళాశాలలు యూనివర్సిటీ నుంచి అనుమతి తెచ్చుకొని కళాశాల ఎక్కడ ఉందో కూడా తెలియని పరిస్థితి ఉంద న్నారు. లైబ్రరీ, మౌలిక వసతులు లేవన్నారు. జిల్లా కన్వీనర్ మాణిక్యరాజ్, రఘు, రేవంత్ రెడ్డి, పవన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సైకాలజీలో డాక్టరేట్ ప్రదానం


ఝాన్సీరాణి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ సైకాలజీ శాఖ స్కాలర్ ఎం. ఝాన్సీ రాణికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈమె మనోవిజ్ఞాన శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ కె.లలిత పర్యవేక్షణలో 'కాగ్నిటివ్స్ స్టిములేషన్ అమాంగ్ ఓల్డర్ పీపుల్ విత్ నార్మల్ కాగ్నిటివ్ ఫంక్షన్ అండ్ మైల్డ్ కాగ్నిటివ్ ఇన్‌ఫర్మెట్ ఎఫికసీ ఆఫ్ కాగ్నిటివ్స్ స్టిములేషన్ థెరపీ' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని వైవీయూకు సమర్పించారు. నిపుణుల బృందం పరిశోధన గ్రంథాన్ని అధ్యయనం చేసి డాక్టరేట్ అర్హత ఉన్నట్లు ప్రకటించారు వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.ఎస్.వి.కృష్ణారావు నోటిఫికేషన్ జారీ చేశారు. ఝాన్సీరాణి రాసిన పరిశోధన పత్రాలు స్కోపస్ యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ (యూజీసీ) కేర్ లిస్ట్‌లోని జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈమె విజయవాడ గన్నవరంలోని డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసోర్స్ ఫౌండేషన్‌లో క్లినికల్ సైకాలజిస్టుగా పనిచేస్తున్నారు. ఝాన్సీరాణిని వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, సైకాలజీ శాఖ విభాగాధిపతి డాక్టర్ వి.లాజర్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

'ఉపాధ్యాయుడిని మానసిక క్షోభకు గురిచేయడం తగదు'

వేంపల్లె, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి):దళితుల సామాజిక న్యాయం కోసం అంబేడ్కర్ సేవా సమితి ఏర్పాటు చేసి కృషి చేస్తున్న బి.రామాంజనేయులును మానసిక క్షోభకు గురిచేయడం బీజేపీ నాయకుడు గాలి హరిప్రసాద్‌కు తగదని దళితనేతలు పేర్కొన్నారు. అంబేడ్కర్‌ను అవమానించినందుకు సెలవుపెట్టి నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటే తప్పేముందని దళితనాయకులు పుల్లయ్య, నాగన్న, కమతం రాజా, ఈశ్వరయ్య, భాస్కర్‌లు పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కడప(వినాయకనగర్),డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో మంగళవారం మైనార్టీ హక్కులకు సంబంధించి క్యాలెండర్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎజాస్‌అహ్మద్, జిల్లా కార్యదర్శి జాకీర్, మహిళా వి భాగం ఉపాధ్యక్షురాలు వయాన రుబినాఖానం, రేష్మ, ప్రధాన కార్యదర్శి సాహిన్‌నిషా, కార్యదర్శి రహిమున్నీషా, ఎగ్జిక్యూటివ్ సభ్యులు షామిద, అఫ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

















పొరపాటు జరిగితే ప్రమాదమే



దొమ్మరనంద్యాల హైస్కూలు ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న కాలువ

జమ్మలమడుగు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మైలవరం మండలం దొమ్మర నంద్యాల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా రోడ్డు పక్కన డ్రైనేజీ కాలువ ప్రమాదకరంగా మారింది. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామశివార్లలోఫిల్టర్ వాటర్ వేస్టేజీ నీరు ఆ కాలువ గుండా హైస్కూలు వద్ద నుంచి పెన్నానదిలోకి కలుస్తున్నాయి. అదే విధంగా మోరగుడి శ్రీరాములపేట వద్ద నుంచి రంగునీళ్ల కాలువ (రాణికాలువ) అద్దకపు బట్టీల నీరు కలుషితమై పెన్నానదిలో చేరుతున్నాయి. కొన్ని నెలలుగా హైస్కూలు ఎదురుగా ప్రభుత్వ వసతి గృహం ఎదురుగా కాలువ నీరు ప్రవహిస్తున్నాయి. విద్యార్థులు విరామ సమయంలో వసతి గృహంలో నుంచి అయినా, హైస్కూలు విద్యార్థులు బయటికి రావాల్సి ఉంటుంది. అదే దారి పక్కన హైస్కూలు ఆర్చి పక్కనే పెద్ద గుంతలు పడ్డాయి. సిమెంటు రోడ్డు నెర్రలుచీలి కూలిపోయింది. ప్రమాదం జరుగుతుందని సంబంధిత అధికారులకు విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులకు తెలియజేసినట్లుగా పలువురు తెలిపారు. అయినా పిల్లలు పొరపాటున కాలుజారి కాలువలో పడితే ప్రమాదం తప్పదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు వెంటనే పరిశీలించి కాలువపై కప్పురాళ్లు వేసి ప్రమాదం జరుగకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వసతి గృహం ఎదురుగా ప్రమాదకరంగా నీటి గుంత

భూ సమస్యలు పరిష్కరించుకోండి

బద్వేలు రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలని నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త రితేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొంగలవీడు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బైసాని ప్రతాప్‌రెడ్డి, గోపవరం ప్రభుత్వఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ భూమిరెడ్డి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'ప్రసాద్ ఎంతో ధైర్యవంతుడు'



జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్,డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు ఆంధ్రజ్యోతి రిపోర్టర్ తల్లం ప్రసాద్ ఎంతో ధైర్యవంతుడని,ఎలాంటి వార్తనైనా ధైర్యంగా రాసేవాడని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కొనియాడారు.స్థానిక టీటీడీ కళ్యాణ మండపలో మంగళవారం ఆయన మిత్ర బృందం ఆధ్వర్యంలో నందిరెడ్డి నాగశివారెడ్డి సంస్మరణ సభ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గం నుంచి జర్నలిస్టులు,రాజకీయ నాయకులు,స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రసాద్ కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని తెలిపారు.











డివైడర్‌ను ఢీకొన్న కారు

ఇద్దరు మృతి, ఐదుగురికి గాయాలు



నుజ్జు నుజ్జయిన కారు

జమ్మలమడుగు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి):జమ్మలమడుగు మండలంలోని చిటిమిటి చింతల గ్రామశివార్లలో మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల మేరకు... సాయంత్రం 7గంటలకు పులివెందుల పట్టణం నుంచి ముద్దనూరు మీదుగా గండికోటకు బయలు దేరారు. చిటిమిటి చింతల గ్రామం వద్దకు రాగానే కారు డివైడర్‌కు ఢీకొని ప్రమాదం జరిగింది.పులివెందుల నుంచి 7 గురు ఒక రోజు ముందుగానే స్నేహితులంతా కలిసి మాట్లాడుకొని జనవరి ఒకటవ తేదీ కొత్త సంవత్సరం గండికోటలో సంతోషంగా గడపాలని బయలుదేరారు. ఘటనాస్థలంలో కారు డ్రైవర్ నందీశ్(21) మృతి చెందాడు.గాయపడిన వారిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఘటనాస్థలంలో మృతి చెందిన డ్రైవర్ నందీశ్ వేముల మండలం భూమాయగారిపల్లెకు చెందిన వాడు.గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో తీవ్రంగా గాయపడిన లింగాల మండలం పెద్దకుడాల గ్రామానికి చెందిన అబ్దుల్(20)అనే యువకుడు ఆసుపత్రిలో మృతి చెందాడు.మిగతావారు జగన్,షాహిన్ పులివెందులకు చెందిన వారు.ప్రేమ్, చైతన్య,షాజహాన్ అనే ముగ్గురు సింహాద్రిపురం మండలానికి చెందిన వారు.గాయపడిన వారందరినీ ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

కొండాపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ్లూరు గ్రామం వద్ద మంగళవారం రాత్రి 9.00 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికంగా ఉండే బ్యాటరీ షాపు యజమాని రేగడిపల్లె నారాయణరెడ్డి(65) రోడ్డు దాటుతుండగా కొర్రపాడు వైపునకు వెళుతున్న బైకు ఢీకొంది. దీంతో బైకు కింద పడింది. దీంతో నారాయణరెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నారాయణరెడ్డి తాడిపత్రి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బైకులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయినట్లు స్థానికులు తెలిపారు.


సీపీఎం ఆధ్వర్యంలో దళితుల నిరసన

జమ్మలమడుగు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన నాగుల పుట్టకు సమీపంలో దళితుల స్థలాలను కొందరు గ్రామస్థులు, కూటమి నాయకులు తదితరులు చేస్తున్న ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకోవాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం ఎదురుగా బాధిత దళితులు నిరసన తెలిపారు. అనంతరం సీపీఎం పార్టీ కార్యదర్శి యేసుదాసు, కమిటీ సభ్యుడు విజయ్, తదితరులు మాట్లాడుతూ కూటమి నాయకులు దొమ్మరనంద్యాల గ్రామంలో పెన్నానది పక్కన ఎక్స్‌కవేటర్లతో పొలాలను ఆక్రమిస్తున్నారన్నారు. స్థానికంగా 50 సంవత్సరాల నుంచి ఎస్సీ కాలనీలో నివశిస్తున్న దళితులపై కూటమి నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఆర్డీవో లేకపోవడంతో కార్యాలయంలో ఉన్న డిప్యూటీ తహసీల్దార్లు నిజాముద్దీన్, రూపేశ్‌కు బాధితులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వినయ్‌కుమార్, ఓబులేసు, నరసింహ, లక్ష్మీదేవి, నారాయుడు పాల్గొన్నారు.

పెన్నానదిలో యువకుడు గల్లంతు

- గాలిస్తున్న గజ ఈతగాళ్లు

జమ్మలమడుగు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు రోడ్డులోని పెన్నానది వంతెన పక్కన మంగళవారం మధ్యాహ్నం గూడెం చెరువు వాసి కూరపాటి వంశీ (22) గల్లంతయ్యాడు. పోలీసుల వివరాల మేరకు గూడెం చెరువు వాసి పుష్పరాజు, కుమారుడు కూరపాటి వంశీ, సాయికుమార్, ప్రభుసాయితో కలిసి పెన్నానది వద్ద వంతెన కిందకు ఈతకు వెళ్లారు. వంశీ మైలవరం జలాశయం నుంచి ప్రవహిస్తున్న నీటి గుంతలో ఈతకొడుతూ మునిగిపోయాడు. వెంటనే స్థానికులు గ్రామస్థులకు తెలియజేశారు. అక్కడ ఎంత గాలించినా కనిపించలేదని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. సంబంధిత అధికారులు స్థానికులతో కలిసి గజ ఈతగాళ్లను రప్పించి గాలిస్తున్నారు. సాయంత్రం 6 గంటల వరకు మృతదేహం లభ్యం కాలేదు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.











భర్త మరణించిన నెలకే భార్యకు ప్రభుత్వ పెన్షన్

పంపిణీ చేసిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : భర్తకు సామాజిక భద్రత ప్రభుత్వ పెన్షన్ వస్తూ మరణిస్తే వెంటనే వితంతువైన భార్యకు ఆ పెన్షన్ వచ్చేలా టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. భర్త చనిపోయిన భార్యలకు 15 మందికి మంజూరైన పెన్షన్‌లను మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, కమిషనర్ మల్లికార్జున పంపిణీ చేశారు.సమావేశంలో మాజీ కౌన్సిలర్లు సోమాబాలయ్య బద్వేలు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగు, సాగునీటి సమస్య లేకుండా చేస్తాం

● మరో టీఎంసీ నిలువ చేయడమే లక్ష్యం : పుట్టా సుధాకర్‌యాదవ్

దువ్వూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు నియోజకవర్గంలో తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా తాగు, సాగునీటి సమస్య లేకుండా చేస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. మండలంలోని చల్లబసాయిపల్లె వద్ద నున్న తెలుగంగ రిజర్వాయర్లను ఆయన బుధవారం పరిశీలించారు. జీఈ కృష్ణారెడ్డితో కలిసి గంగ కాలువలో స్టోరేజీ ప్రస్తుత అవసరాలు, ఇతర అంశాలపై చర్చించారు. ఎస్ఆర్-1 నుంచి ఎస్ఆర్-2కు వెళ్లే మధ్యలో బ్రిడ్జీ వద్ద నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. వెలుగోడు నుంచి దిగువకు నీటిసరఫరా నిలిచిన నేపథ్యంలో ఇక్కడ రిజర్వాయర్ల ద్వారా నీరు వృథా జరుగకుండా గేట్లు మూయించి వేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్-1, ఎస్ఆర్-2లలో నీటి నిలువ 215 అడుగుల నుంచి 217.3 అడుగులకు పెంచాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. తద్వారా అదనంగా మరో టీఎంసీ నీటిని నిల్వ ఉంచవచ్చునని తెలిపారు.

● గోశాల పరిశీలన..: తెలుగుగంగ రిజర్వాయర్ సమీపంలో నంద్యాల రాఘవరెడ్డి ఏర్పాటు చేసిన గోశాలను ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ సందర్శించారు. ఎమ్మెల్యే వెంట తెలుగుగంగ ఈఈ క్రిష్ణారెడ్డి, డీఈలు నాగిరెడ్డి, రామమోహన్, టీడీపీ కన్వీనర్ రమణారెడ్డి, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సబ్సిడరీ రిజర్వాయర్-2కు వెళ్లే గంగనీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

హైందవ శంఖారావం విజయవంతం చేయండి

పోరుమామిళ్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : జనవరి 5న విజయవాడలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగే హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందుత్వ సంస్థల ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, ఫణిరావు, కశ్యప్‌రెడ్డి, బాలరంగయ్య అన్నారు. మంగళవారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ జనవరి 4న రాత్రి 8గంటలకు కడప నుంచి ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, గిద్దలూరు మీదుగా విజయవాడకు ప్రత్యేక ట్రైన్ ద్వారా వెళ్లడం జరుగుతుందని, పోరుమామిళ్ల నుంచి నాలుగు బస్సులు బయల్దేరుతాయన్నారు.

బస్సు ఢీ కొని విద్యార్థికి గాయాలు

మైదుకూరు రూరల్,డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : మైదుకూరులోని సరస్వతిపేటకు చెందిన పోతురాజు గురవర్ధన్ అనే విద్యార్థి ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కాగా గురువర్ధన్ మంగళవారం పాఠశాల నుంచి ఇంటికి సైకిల్‌పై వెళుతుండగా కడప నుంచి మైదుకూరు వైపు వస్తున్న ఆర్‌టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొనగా విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి.108 సహాయంలో గాయపడిన విద్యార్థిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని స్థానికులు తెలిపారు.గురువర్ధన్ మేనమామ చంద్రమోహన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏపీటీఎఫ్ కేలండరు ఆవిష్కరణ

పోరుమామిళ్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎఫ్ కేలండరును తహసీల్దారు చంద్రశేఖరరెడ్డి , ఎంఈవో బాల అంకిరెడ్డి సమక్షంలో ఆవిష్కరించారు. మంగళవారం పోరుమామిళ్ల లోని ఎమ్మార్సీలో వారితో పాటు ఉపాధ్యాయులు పాల్గొనిఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సురేంద్రనాధరెడ్డి, యాస్మిన్, వెంకట్రామిరెడ్డి, ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే

మైదుకూరు రూరల్,డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మంగళవారం ఆయన బంగ్లాలో కలిశారు.కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించారు.మైదుకూరు నియోజకవర్గంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు.అభివృద్ధి కార్యక్రమాలకు కొంత నిధులను కేటాయించాలని కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు పుట్టా తెలిపారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
APEWIDC, KADAPA DIVISION

Tenders are invited on e-procurement Short Tender Notice **NIT No. 23 to 26/EE/APEWIDC/DM/Kdp/2024-25, Dt. 31.12.2024.** Downloading commencement on 02.01.2025 and closing date may be viewed in e-procurement.gov.in

For further details can be viewed at https: //tender.apeprocurement.gov.in or contact **Cell : 93906 63855**

Sd/- D. Gurivi Reddy,
Executive Engineer,
APEWIDC, Kadapa.

ANDHRA PRADESH MEDICAL SERVICES & INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION, KADAPA.

Tender Notice No. 04/EE/APMSIDC/Div/Kdp/2024-25, dt:31.12.2024

Tender is invited through 'e' procurement platform for the work

1) Construction of Sub Centre building (balance work) at Ananthasamudram(v) Pullampeta(M) in Annamayya District.

Tender Schedule to the uploaded in www.apeprocurement.gov.in on **02.01.2025** for any other information and clarification, please contact the Executive Engineer, APMSIDC Division Office, New RIMS Campus, Kadapa in office working hours. **Ph. No. 08562-225632 (8525839240)**

EE / APMSIDC / DIV / KDP.

































ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిరుద్యోగ సమస్యపరిష్కారానికి ఉక్కు ఫ్యాక్టరీ ఒక్కటే శరణ్యమని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో 3వసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ పార్టీ రాష్ట్ర విభజన హామీలు అమలు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో శేఖర్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

పోలీసు నిబంధనలు పాటించాలి

జమ్మలమడుగు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగుపోలీసు సబ్‌డివిజన్ పరిధిలో జనవరి 1ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ పోలీసు నిబంధనలు పాటించాలని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ లింగప్ప సూచించారు. మంగళవారం జమ్మలమడుగులో 31వ తేదీ రాత్రికానీ, 1వ తేదీ ఉదయం పోలీసులు వాహనాల తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, పిల్లలకు వారి తల్లిదండ్రులు స్కూటర్లు ఇచ్చి నడిపినా, లైసెన్సులులేకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. అందులో భాగంగా గండికోట పర్యాటక ప్రాంతంలో గట్టి నిఘా ఏర్పాటుచేసినట్లు వారు తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గీతాశ్రమంలో బీజేపీ ప్రొద్దుటూరు పట్టణ, మండల, రాజుపాళెం మండల నూతన అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేశారు. ప్రొద్దుటూరు పట్టణం 1 విభాగానికి వంధార నరేంద్రరావు, పట్టణం-2 విభాగానికి పాలెం కిరణ్‌కుమార్, మండల విభాగానికి సుధీర్, రాజుపాళెం మండలానికి ఎం.అశ్విత్‌ను అధ్యక్షులుగా నియమించారు. బీజేపీ జిల్లా క్రియాశీలక సభ్యత్వాల ప్రముఖ్ శ్రీనాథ్‌రెడ్డి, సభ్యత్వాల ఆర్వో ప్రదీప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, పట్టణ సభ్యత్వాల ప్రముఖ్ జయలక్ష్మి, గురుప్రసాద్ రవిశంకర్, పృథ్వీనారాయణ, విక్రాంత్, సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి హరినారాయణ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ వేడుకలు

పోరుమామిళ్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షులు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వంశీ, కౌశిక్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరుకు చెందిన విద్యార్థి చికిలిగిరి సాద్ ఇర్ఫాన్ ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబరు 28, 29, 30 తేదీల్లో అంతర్‌జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-14 క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనపరిచారు. దీంతో అంతర్‌జిల్లాల క్రీడా పోటీల్లో ప్రతిభ కనపరిచిన 30 మందిని క్రికెట్ ప్రాబుల్స్‌కు ఎంపిక చేసి డిసెంబరు 30వ తేదీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించిన సాద్‌ఇర్ఫాన్ జట్టుకుఎంపికయ్యారు. జనవరిలో ముంబై లేదా పాట్నాలో జరిగే ఎస్‌జీఎఫ్ అండర్-14 క్రికెట్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థి ప్రస్తుతం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు.

ప్రొటోకాల్ పాటించకుండా పెన్షన్ల పంపిణీ తగదు

● మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు , డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సంబంధించిన ప్రొటోకాల్ పాటించకుండా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చేతుల మీదుగా టీడీపీ కార్యాలయంలో పెన్షన్‌లను పంపిణీ చేయడం తగదని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అభ్యంతరం తెలిపారు. మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మెన్లు బంగారురెడ్డి, ఖాజా,కౌన్సిలర్లతో కలిసి కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన పెన్షన్ల పంపిణీ మున్సిపాలిటీ కార్యాలయంలో గానీ సచివాలయాల్లో కాకుండా టీడీపీ కార్యాలయంలో పంపిణీ చేయడం ఏమిటని ప్రశ్నించారు.

పట్టపగలే మెడలో గొలుసు చోరీ

బద్వేలుటౌన్, డిసెంబరు, 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పట్టపగలే ఓ మహిళ మెడలో బంగారు సరుడును దొంగలు లాక్కెళ్లిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.... నారాయణస్కూలు సమీపంలో సరస్వతి నడుచుకుంటూ వస్తుండగా, ఇద్దరు దొంగలు బైకులో వేగంగా వచ్చి ఆ మహిళ మెడలోంచి 3తులాలు బంగారు సరుడును లాక్కెళ్లారు. దీంతో ఆమె బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు వారిని వెంబడించినా ఫలితం లేకపోయింది. దీంతో సరస్వతి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అల్లం సత్యను అరెస్టు చేసిన పోలీసులు

కొండాపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏటూరు వాసి వైసీపీ జిల్లా సోషల్ మీడియా కో-కన్వీనర్ అల్లం సత్యను పోలీసులు అరెస్టు చేశారు. అదనపు కట్నం తెమ్మంటూ తనపై హత్యాయత్నానికి పాల్పడినట్లు సత్య భార్య నవీన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఇతనిపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇతన్ని మంగళవారం ఉదయం ఏటూరు బస్టాండు వద్ద అరెస్టు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇతన్ని జమ్మలమడుగు కోర్టులో హాజరు పరచగా, కడప సబ్‌జైలులో 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.





















ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై విమర్శలు తగదు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై రాచమల్లు ప్రసాద్‌రెడ్డి విమర్శలు చేయడం తగదని జనసేన ప్రోగ్రాం కమిటీ సభ్యుడు జిలానీబాష పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన గాలివీడు ఎంపీడీవోను పవన్‌కల్యాణ్ పరామర్శించి ఉద్యోగులను ఆత్మస్థైర్యం నింపారన్నారు. దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. పవన్ వాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే పెడ తార్థాలు తీసి పవన్‌కు రాయలసీమపై కోపమని, రెడ్లు అంటే గిట్టదని విమర్శించడం తగదన్నారు. ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో అధికారి కుర్చీలో కూర్చొని అధికారులను బెదిరించిన రాచమల్లు చరిత్ర నియోజకవర్గ ప్రజలకు తెలుసునన్నారు. ఇసుక మాఫియాను అడ్డుకున్న మహిళా ఎస్‌ఐపై వైసీపీ నాయకులు దాడి చేసి గాయపరిచిన సంగతి నియోజకవర్గ ప్రజలకు ఇప్పటికీ గుర్తు ఉందని పేర్కొన్నారు. రాయలసీమ చరిత్ర గురించి ఇక్కడున్న మహనీయుల గురించి రాచమల్లు కన్నా పవన్‌కల్యాణ్‌కు ఎక్కువ తెలుసునని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు మురళి, జిలానీ, శివ కుమార్ పాల్గొన్నారు.

పాత బకాయి బిల్లులు ఇవ్వండి

● కౌన్సిలర్ల ఆవేదన

జమ్మలమడుగు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనుల బిల్లులు వెంటనే చెల్లించాలని కౌన్సిలర్లు ముల్లాజానీ, మునిసుబ్బారెడ్డి, వైస్‌చైర్మన్-2 సింగరయ్య తదితరులు కోరారు. మంగళవారం జమ్మలమడుగు నగర పంచాయతీ కార్యాలయ సభాభవనంలో మున్సిపల్ సమావేశం జరిగింది. ముందుగా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కౌన్సిలర్లు నివాళులర్పించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి హాజరయ్యారు. మున్సిపల్ సమావేశంలో జమ్మలమడుగులో జరిగిన జరగబోయే అభివృద్ధి పనులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు కొందరు కాంట్రాక్టు పనులు గత ప్రభుత్వంలో చేశారని, వాటిని గుర్తించి బిల్లులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని, ఛైర్‌పర్సన్ శివమ్మను కోరారు. ఈ కార్యక్రమ ంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, కోఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ శవం లభ్యం

రాజుపాలెం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని టంగుటూరు గ్రామం వద్ద కుందూనదిలో గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైనట్లు ఏఎస్‌ఐ సిద్దయ్య తెలిపారు. మంగళవారం సాయంత్రం కుందూనదిలో సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయసున్న మహిళా శవం తేలాడుతూ ఉండడంతో గ్రామస్థుల సమాచారం మేరకు వీఆర్వో సరళ శవాన్ని పరిశీలించి పోలీసులకు తెలిపారు. దీంతో శవాన్ని స్థానికుల సాయంతో బయటకి తీసి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజలందరికీ న్యూ ఇయర్ శుభాకాంక్షలు

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్,డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు నియోజకవర్గ ప్రజలు, టీడీపీ నాయకులు,కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆంధ్రజ్యోతితో తెలిపారు.ఈ కొత్త సంవత్సరంలో పాడి పంటలు బాగా పండి, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని పుట్టా తెలిపారు.

లక్ష్యాలతో ముందుకు సాగాలి

మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డి

బద్వేలు టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : గడిచి న సంవత్సరపు అనుభవాలు, జ్ఞాపకాలతో నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకుసాగాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నూతన సంవత్సరంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అన్నివర్గాల ప్రజలు ఆయురారోగ్యాలతో జీవించాలని వారు ఆకాంక్షించారు.



















పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి